# 7. తృప్తి

నులక మంచంలో వెల్లకిలా పడుకొని గోడదిక్కు చూస్తున్నాడు. రమేష్... ఓ సాలెపురుగు గూడు కట్టుకోవడానికై విఫల ప్రయత్నం చేస్తుంది ఎన్నిసార్లు ప్రయత్నించినా గూడు నిలవడం లేదు.... అయినా అది ప్రయత్నం మానుకోవడం లేదు చివరకో గంట తర్వాత దాని ప్రయత్నం ఫలించింది గూడు నిలిచింది అది చూసిన రమేష్ దిగ్గన లేచాడు... తానెన్నిసార్లు ప్రయత్నించినా భేతాళుడు స్వాధీనం కానంత మాత్రాన తనప్రయత్నాన్ని విరమించుకోవడం సరైంది కాదనుకున్నాడు విక్రమార్కుడిలా భేతాళున్ని సాధించాలనుకున్నాడు — ద్విగుణీకృతోత్సాహంతో చెట్టు దగ్గరకెళ్ళాడు— గబ గబా చెట్టు పైకి పాకి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగాడు శ్మశానంకేసి వేగంగా అడుగు లేస్తున్న రమేష్‌తో భేతాళుడు.

"ఓ మానవా! నీ ప్రయత్నం చాలా బాగుంది—? చూస్తే నువ్వో ఉద్యోగిలా కనబడుతున్నావు నా ఊహే నిజమయితే నువ్వు రావాల్సిన ప్రమోషన్ కోసం ప్రయత్నిస్తున్నావు. అన్నాడు

అవును—కాని ఎవరితో చెప్పుకొని ఏంలాభం? పద్దెనిమిదేళ్ళుగా ఒక గ్రేడులో క్లర్కుగా పనిచేస్తున్నాను. ఎదుగూ బొదుగూ లేని జీతం—ఓ దిక్కు నా కంటే విద్యార్హతలు తక్కువున్న వాళ్ళు జూనియర్లూ

కాకాలు పట్టి పైపైకి పోతున్నారు. నా కది చేత కావడం లేదు అందుకే నా ఈ ప్రియత్నం...., తనలో తాన నుకొని మౌనంగా నడుస్తున్నాడు రమేష్ —

"నువ్వు చెప్పకున్నా నీ ముఖ కవలికల్ని బట్టి నీ అవసరాన్నూహించగలను— నీకు బరువు తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను విను అని చెప్పసాగాడు భేతాళుడు — మలిచి కట్టిన దొడ్డు పంచె — తెల్ల బట్టతో కుట్టిన ఆపారం అంగీ – తలపై కుప్పున పంచు రుమాలు— బండబారిన ముఖం— బుర్రమీసాలు– ఇదీ రాజయ్య ఆకారం ఎనిమిది చదరపు గజాల వైశాల్యంలో కిచిడి గడ్డి కప్పుగా గల గుడిసె. కూలి చేస్తూ జీవించే భార్య అతని ఆస్తి– కొడుకులిద్దరు రెక్కలొచ్చి వేరుగా జీవిస్తున్నారు రెండు కుంచాల ధాన్యం పట్టేగంపలో మోతుకాకులు నింపుకొని వాడ వాడకు తిరుగుతూ అమ్మతాడు రాజయ్య–అతడు ఆకు లమ్మతాడనడం కంటే ఇంటింటికి తిరిగి ఆకులేస్తాడనడం బాగుంటుందేమో–! ఎందు కంటే అతడు ఆకులేసి ఇచ్చే ధాన్యం కొరకు పట్టుబట్టి అడగడు ఇస్తే తీసుకుంటాడు తప్ప ఇవ్వని వాళ్ళను బలవంతం చేయడు అయితే అతని ముఖంలో ఈ ప్రపంచాన్నే జయించానన్నంత ధీమా– ధైర్యం. గాంభీర్యం. తృప్తి అగుపడుతుంటాయి.

అతన్ని గూర్చి ఊరివాళ్ళు రకరకాలుగా అనుకుంటారు–

గీ"రాజయ్య భలేటోడు– ఆకులేత్తడు కనీ ఇత్తులడుగడు"

"గీ కలీగంల పుట్టవలసినోడు గాదు–

"పిసోడు! గింతన్న బతుకుదెరువు లేదు—

రాజయ్య ముఖంలో కనబడే తృప్తి చూస్తే ఆ ఊళ్ళో కొండయ్య పటేలుకు అదోలా అనిపిస్తుంది– యాభై అరవై ఎకరాల సాగుభూమి,

ఎకరాల స్థలంలో పెద్ద ఇల్లు, జిల్లా హెడ్ క్వార్టర్లో ఆస్తులు, లక్షల రూపాయలు నగదు ఉన్న కొండయ్య పటేలు ముఖంలో ఎప్పుడూ ప్రశాంతత కనబడదు— ఎప్పుడూ ఏదో సంపాదించాలన్న ఆరాటమే— ఇంత ఆస్తివున్నా తనకు లేని తృప్తి ఓ పూటకుంటే ఓపూటకు లేని రాజయ్యలో ఎలా వుంటుందో కొండయ్య పటేలు కర్తమయ్యేది కాదు రాజయ్యంతో ధీమాగా ఉండటం చూసి ఆశ్చర్యపోయేవాడు. ఓ రోజు... ఆకులు...ఆకులూ! చుట్టాకులూ... అంటూ పోతున్న రాజయ్యను పిలిచి ఆకులేయించుకున్నాడు కొండయ్య వడ్లివ్వక ముందే గంపనెత్తుకో బోయాడు రాజయ్య.

"వడ్లద్దా పోతన్నవేంది....? ' అన్నాడు కొండయ్య—

"ఏడికి పోతయి పటేల వడ్లు తెస్తె తేంద్రి..."

"ఇంట్ల ఎ పాటి వడ్లున్నయి? పర్వలేనట్టు మాట్లాడుతున్నవు?"

"ఇగో జూడు పటేల గంపల మానెడడ్లున్నయి. ఇయ్యాల్టికై తయి ఇంకేంగావాలె....? అని గంపనెత్తుకొని పోయాడు రాజయ్య.

ఆతని ముఖంలోని తృప్తిని చూసి స్థాణువయ్యాడు కొండయ్య.

కథ చెప్పడం ఆపాడు భేతాలుడు.

"అన్ని ఆస్తిపాస్తులున్నా కొండయ్యకు లేని తృప్తి రాజయ్యకెలా వుంది...? వీళ్ళిద్దరిలో ఎవరెక్కువ సుఖపడుతున్నారని నీ ఉద్దేశ్యం...?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసే చెప్పకపోయావో నీ కంటె మరో జూనియర్ నీ బాసయ్యేలా శపిస్తాను ? అని ఆగాడు భేతాళుడు.

ఈ భేతాళుడు భలే చాలుగాడున్నడు, నేను ప్రమోషన్ కోసం ప్రయ

త్నిస్తున్నానని తెలిసి ఉన్నదాంతోనే తృప్తిపడమని నాకు పరోక్షంగా చెబుతున్నాడు. నేనేం మేడల మిద్దెలు కోరడం లేదు. కనీసావసరాలు తీర్చే ఆదాయం కావాలంటున్నాను ఆదీ ప్రమోషన్‌తో వచ్చే రెండు వందల రూపాయలతో రాకున్నా పేన్నీళ్ళకు చన్నీళ్ళ తోడులా వుంటుం దని నా ప్రయత్నం...? గొణుక్కున్నట్టు తనలో తానే అనుకొని భేతా ళుని ప్రశ్నలకు జవాబులు చెప్పసాగాడు రమేష్.

"కొండయ్యకన్ని ఆస్తిపాస్తులున్నా వాట్నింకా పెంచాలన్న ఆరాటం. ఎవర్ని ముంచయినా సరే ఆస్తిని పాపంలా పెంచాలన్న తాపత్రియం... ఉన్నవాడికి లక్షలుంటే మిలియన్లు కావాలని, మిలియన్లుంటే కోట్లు కావా లని ఇలా ఆశలు పెరుగుతూనేవుంటాయి ఇంకా ఇంకా సంపాదించాలను నక్కున్న కొండయ్యకు ఆస్తిపాస్తులపైవున్న మమకారం వల్లే జీవితంలో తృప్తి లేదు—

అదే రాజయ్యున్నాడు—అతనికి ఉన్నదా లోనే సంతృప్తిపడే గుణ ముంది—రెక్కల కష్టంతో మాత్రమే బ్రితికే రాజయ్యకు ఏ రోజైనా అలాగే బ్రతుకాలి కాబట్టి రేపటి కోసం కూడబెట్టాలన్న ఆలోచనలేదు— అందువల్లే ఆ పూటకున్న ధాన్యాన్ని చూసుకొని ఇవ్వాల్టికన్నాయని ఎంతో ధీమగా వున్నాడు— అందుకే కొండయ్యకు లేని తృప్తి రాజయ్యకుంది—

సుఖం మానసికం అనుకుంటే కొండయ్య కంటె రాజయ్యే ఎక్కువ సుఖపడ్తున్నాడని చెప్పవచ్చు-భౌతికంగా మాత్రం కొండయ్యే ఎక్కువ సుఖపడుతున్నాడు—

ఈ కథ చెప్పడంతో మీ ఉద్దేశ్యం ఏదైనా-ఉన్న వాళ్ళింకా ఆస్తులు పెంచుకుంటూ పోతుంటే లేనివాళ్ళు ఉన్నదాంతోనే తృప్తిపడాలని బోధిస్తే మాత్రం దానితో నేనే కీభవించను...."

రమేష్ నుంచి తానాశించిన సమాధానం రాగానే శవంతోసహా మాయ మై చెట్టెక్కాడు భేతాళుడు—

—★—

[జీవగడ్డ 16 మార్చి 86]